కొత్త ముచ్చుమర్రి.. రూపురేఖలు మారి

- గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన అభివృద్ధి
- జగనన్న పాలనలో శరవేగంగా జరిగిన పనులు
- ఒక్క గ్రామానికే రూ. 19.69 కోట్లు వ్యయం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




పూర్తయిన సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం

పగిద్యాల: నాలుగు దశాబ్దాల క్రితం నీటి ముంపు పునరావాస గ్రామంగా పురుడుపోసుకున్న కొత్త ముచ్చుమర్రి ప్రజలు మొన్నటి వరకు కంకర తేలిన మెటల్ రోడ్లపై నడుస్తూ అవస్థలు పడుతూ వచ్చారు. ఎస్సీ కాలనీవాసులు అంతర్గత రోడ్లు, పక్కా ఇళ్లు తదితర అభివృద్ధి పనులకు నోచుకోక ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో శాప్ చైర్మన్ పదవిని చేపట్టి నియోజకవర్గ అభివృద్ధితో పాటు స్వగ్రామమైన ముచ్చుమర్రి అభివృద్ధికి పాటుపడ్డారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక శరవేగంగా అభివృద్ధి జరిగి కొత్త ముచ్చుమర్రి రూపురేఖలు మారిపోయి గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ గ్రామం నుంచి టీడీపీ తరుపున రెండు సార్లు ఎమ్మెల్యే ఎన్నికైనా సొంత గ్రామంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. 2019లో రాజకీయ ఆరంగ్రేటం చేసిన యువనాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కాలనీవాసులు పడుతున్న కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపి వారి మనసును గెలిచారు. గ్రామంలో సీసీ రోడ్లు, శిథిలమైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టారు. అంతేకాక పాఠశాలలను అభివృద్ధి చేశారు.

గ్రామానికి చేకూరిన లబ్ధి వివరాలు

ప్రత్యేక్ష, పరోక్ష ప్రయోజనాల కింద ప్రజలకు చేకూర్చిన ఆర్థిక లబ్ధి (డీబీటీ+నాన్‌డీబీటీ) రూ. 15,37,68,000లు, నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.15 కోట్లు, జీజీఎంపీ కింద సీసీ రోడ్ల అభివృద్ధికి రూ. 20 లక్షలు, ఎంపీ ల్యాడ్స్ కింద రూ. 15 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ. 25లక్షలతో సీసీ రోడ్ల అభివృద్ధి, సచివాలయ భవనానికి రూ. 43.60 లక్షలు, రైతు భరోసా కేంద్ర భవనానికి రూ. 23.94లక్షలు, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ. 20.80లక్షలు ఖర్చు చేశారు.


నాడు ఎస్సీ కాలనీలో కంకర తేలిన మెటల్ రోడ్డు


నేడు సీసీ రోడ్డుతో కళకళలాడుతున్న ఎస్సీ కాలనీ

సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఇద్దరు లబ్ధిదారులకు (కాంతమ్మ, బీరవోలు నరేంద్రబాబు) రూ. 6 లక్షలు, మన బడి నాడు –నేడు కింద రూ. కొత్త ఎల్లాల పాఠశాలకు రూ. 25,33,696, కొత్త ముచ్చుమర్రి పాఠశాలకు రూ. 33 లక్షలు, రూ. 1.20 కోట్లతో 8 ఎకరాలు కొనుగోలు చేసి 290 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వంద మందికి పక్కా ఇళ్లు మంజూరు చేయడం విశేషం.

ఊహించలేనంత అభివృద్ధి జరిగింది

సీఎం జగనన్న పాలనలో మా గ్రామంలో ఊహించలేనంత అభివృద్ధి జరిగింది. ఐదేళ్లలో మా గ్రామానికే సుమారు రూ. 20 కోట్లు వరకు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామ సచివాలయాలు గ్రామానికే తలమానికంగా ఉన్నాయి. లేదంటే పనుల కోసం మండల హెడ్ క్వార్టర్ చుట్టూ తిరగలేక అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. సచివాలయ అధికారులు వెంటనే స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.


– మధు, కొత్త ముచ్చుమర్రి

శరవేగంగా సీసీ రోడ్లు పూర్తి

కొత్త ముచ్చుమర్రి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లను శరవేగంగా పూర్తి చేయించాం. చాలా ఏళ్లుగా ఆ కాలనీలల్లో సీసీ రోడ్లు లేవు. కంకర తేలిన మెటల్ రోడ్లు దర్శనమిచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. అన్ని రోడ్లు కవర్ చేశాం. జీజీఎంపీ, ఎంపీ ల్యాడ్స్, ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు వేయించాం.

– వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, పగిద్యాల

రేపటి నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

పగిద్యాల: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నుంచి అన్ని గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీఓ వెంకటరమణ గురువారం తెలిపారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న లే అవుట్ కాలనీల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారుల పేరు మీద సబ్‌రిజిస్ట్రార్ నిబంధనల మేరకు పంచాయతీ కార్యదర్శులు రిజిస్ట్రేషన్లు చేస్తారని ఎంపీడీఓ వెల్లడించారు. మండల వ్యాప్తంగా జగనన్న లే అవుట్ కాలనీలో ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు గడువు ఉన్నందున లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరపడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు దండోరా వేయిస్తామని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

మహానందీశ్వరుడికి విశేష పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి గురువారం వేద పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వారికి వేకువ జామున సుప్రభాత సేవ, అష్టవిధ మహా మంగళ హారతులు, అభిషేకం, అర్చన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. హారతులు సమయం నుంచి స్వామి, అమ్మవారి దర్శనం ప్రారంభం అయింది. కాగా శుక్రవారం మహానందీశ్వర దంపతులకు పల్లకీ సేవ కార్యక్రమం ఉంటుందని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం


సంగయ్యపేటలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని సంగయ్యపేటలో సీనియర్ న్యాయవాది నజీర్ అహమ్మద్, సమ్మద్ అహమ్మద్, అహమ్మద్ హుసేన్, అబ్దుల్ రహిమాన్, డాక్టర్ జహీర్, జుబేర్, ఇర్ఫాన్, మహబూబ్‌బాషా, అబ్దుల్ మాలి, మౌలానా నూర్ మహమ్మద్‌తో పాటు మరో 50 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వారికి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరణంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే సార్వత్రిక ఎన్నికల్లో విజయాన్ని తెచ్చిపెడుతాయన్నారు. నవరత్నాలతో అర్హులైన వారందరికీ ఒక పైసా లంచం లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని చెప్పారు. చంద్రబాబు పాలనలో పింఛన్ కావాలన్నా లంచం తీసుకొనే మంజూరు చేశారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

పట్టణంలో రూ.16 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు

పట్టణంలో ప్రత్యేక నిధులు రూ. 16 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం జరిగిందని సిద్ధార్థరెడ్డి అన్నారు. 20 ఏళ్ల నుంచి షాదీఖానా నిర్మాణం పట్టించుకోకపోతే జగనన్న ప్రభుత్వంలో రూ.3 కోట్లు వెచ్చించి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయబ్, కృష్ణ, చాంద్‌బాషా, రవూఫ్, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఆర్టీసీ బాబు, జబ్బార్, అబుబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక 'ఆసరా'

- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- ఏబీఎం పాలెంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం


పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ కిషోర్


సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్, కమిషనర్, పొదుపు మహిళలు

నందికొట్కూరు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక ప్రగతి లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఏబీఎం పాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో 1, 22, 23వ వార్డులకు చెందిన 87 పొదుపు సంఘాలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. పొదుపు మహిళలతో కలసి సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళలు ఆనందంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఆయన అందజేశారు. పొదుపు మహిళలు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో రుణాలను మాఫీ చేస్తానని చంద్రబాబు మోసం చేశారన్నారు. పసుపు కుంకుమ పేరుతో మహిళలను నిట్టనిలువునా మాయ చేసిన ఘనుడు చంద్రబాబేనని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి సంక్షేమ పథకాలు పేద మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు కుటుంబాలను ఆర్థిక ప్రగతి నడిపిస్తున్నాయన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం నాల్గవ విడత కింద 87 పొదుపు రూ. 52,34,198 మహిళలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. నాల్గవ విడత నగదును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా పొదుపు మహిళల ఖాతాలో నగదును జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చిన్నరాజు, సురేష్, మెప్మా సీఎంఎం శాంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సులోచ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో మంచి పాలకులను ఎన్నుకోవాలి




సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, శ్రీశైలంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం , పగిద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: తప్పకుండా ఓటు వేసి మంచి పరిపాలకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిస్పక్షపాతంగా తమ ఓటును సద్వినియోగపరచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది

శ్రీశైలం: ఓటు హక్కు ఎంతో విలువైనదని వీఆర్ఓ ప్రదీప్ అన్నారు. శ్రీశైలంలోని స్థానిక వీధుల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటరు ప్రాముఖ్యత, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది

నందికొట్కూరు రూరల్ : యువతకు ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. బొల్లవరం గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.


నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటరు దినోత్సవ ముగ్గు

కొత్తపల్లి: మండల కేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, గ్రామ రెవెన్యూ అధికారులు లింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: సామాన్యుడి చేతిలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ పఠాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ఓటు హక్కును నిస్వార్థంగా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

నందికొట్కూరు: ఓటు హక్కు ఉన్న వారందరికీ అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న సుంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పించారు. దేశ అభివృద్ధి కోసం పాటుపడే పార్టీలకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రాంబాబు, భాను, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని బతికిద్దాం

పగిద్యాల: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని బతికిద్దామని తహసీల్దార్ భారతీ, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. బస్టాండులో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీ, సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు చేపట్టారు. గురువారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు,అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందు కు ముందుగా మహాగణపతి పూజ జరిపించా రు.అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది , అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.


స్వామిఅమ్మవార్ల పల్లకోత్సవం

శ్రీశైలంలో సామూహిక రుద్రహోమం




రుద్రహోమం క్రతువులు నిర్వహిస్తున్న అర్చకులు,ఉచిత సామూహిక రుద్రహోమం పూజల్లో పాల్గొన్న భక్తులు

- పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులకు ఉచిత సేవ నిర్వహణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సామూహిక రుద్రహోమం నిర్వహించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారి సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఉచిత సామూహిక సేవలలో భాగంగా చంద్రవతి కల్యాణ మండపంలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న భక్తులతో సామూహిక రుద్రహోమాన్ని నిర్వహించారు. ముందుగా భక్తులందరీ చేత గోత్రనామాలతో సంకల్పం, మహాగణపతిపూజ జరిపించారు. అలాగే స్వామిఅమ్మవార్లకు షోడశోపచార పూజలు జరిపిన అనంతరం రుద్రహోమం జరిపించారు. పాల్గొన్న భక్తులందరిరీ స్వామిఅమ్మ వార్ల దర్శనం కల్పించారు. సేవాకర్తలకు రెండు లడ్డూప్రసాదాలు, కైలాసకంకణాలు, అందజేసి, అన్నపూర్ణ భవనంలో భోజన సదుపాయం కల్పించారు. రుద్రహోమంలో స్థానికులే కాకుండా గుంటూరు, తెనాలి, తాడిపత్రి, కర్నూలు, ప్రకాశం, వైఎస్సార్, హైదరాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు అయ్యన్న పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వేదిక మార్పు

మహానంది: మండల సర్వసభ్య సమావేశం వేదికను మార్పు చేసినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ముందుగా ఎప్పటిలాగే బుక్కాపురంలోని పొదుపు మహిళా సమాఖ్య కార్యాలయంలో అనుకున్నామని, అయితే తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయానికి మార్చామన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ఈనెల 31న సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా: ఈనెల 31న జూపాడుబంగ్లా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు హాజరవ్వాలన్నారు.

కులగణనను పకడ్బందీగా చేపట్టండి


సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి

మిడుతూరు: కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక బీసీ కాలనీలో చేపడుతున్న కుల గణన సర్వేను తనిఖీ చేశారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కుటుంబ వివరాల నమోదు చేయడంలో పొరపాట్లకు తావులేకుండా చేపట్టాలని తెలిపారు.

సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను ఆదివారం నాటికి పూర్తి చేయాలని ఎంపీడీఓ శివనాగజ్యోతి సూచించారు. గురువారం ఆమె సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచనలు చేశారు. నాలుగు రోజుల్లో సర్వే పూర్తి చేసి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు ఆడియో సిస్టమ్ విరాళం


పాఠశాలకు ఆడియో సిస్టమ్‌ను బహుమతిగా అందిస్తున్న గణిత ఉపాధ్యాయురాలు శైలజ

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని దామగట్ల జెడ్పీ హైస్కూల్‌కు పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయిని శైలజ రూ.18 వేలు విలువ చేసే ఆడియో సిస్టమ్‌ను బహుమతిగా అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం అనితా జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆమెను అభినందించారు.

ఆర్థిక సాయం

కొత్తపల్లి:మూడు రోజుల క్రితం మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో కె.హుస్సేనమ్మ అనే మహిళ గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తొగట నాగర్జున ప్రసాద్ గురువారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కుల రాము, వీరా, మల్లయ్య, మహేశ్వర రెడ్డిలు కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5000 నగదును అందించారు. కార్యకర్తలకు ఎప్పటికి వైఎస్సార్‌సీపీ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో పనిచేస్తున్న 19 మంది పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ గురువారం నంద్యాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్.మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వై.ఆశీర్వాదం తెలిపారు. గ్రామపంచాయితీ పరిధిలో 2020 నుంచి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కేవలం రు.6,000 నే ఇస్తున్నారని, అది కూడా నెలనెలా చెల్లించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆశీర్వాదం తెలిపారు.

గాయపడిన చెంచు నాగన్న మృతి

ఆత్మకూరురూరల్: మండలంలోని సంజీవనగర్‌తండా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన నాగన్న కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మరణించాడు. గుల్ల నాగన్న బైర్లూటి గ్రామ పంచాయతీలోని నాగలూటి గూడెంకు చెందిన వాడు. విషయం తెలియగానే గూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్

మహానంది: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ సూచించారు. బండి ఆత్మకూరు మండలం ఏ.కోడూరులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఉపాధి కూలీలకు కనీస వేతనం అందేలా పనులు చూపాలని ఆదేశించారు. అనంతరం ఏపీఓ వసుధారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలతో వివిధ అంశాలపై చర్చించారు.

పంటలకు నీటి విడుదల

మహానంది: బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామంలో ఎత్తిపోతల పథకం కింద నీరు లేక ఆరుతడి పంటలు ఎండిపోతుండటంతో గ్రామ సర్పంచ్ రేగటి జగన్‌మోహన్ రెడ్డి ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శిల్పా అధికారులతో మాట్లాడి గేట్ల నుంచి నీటిని వదిలేందుకు అనుమతి తీసుకున్నారు. దీంతో ఎత్తిపోతల పథకం కింద పంటలకు నీరు వదలడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

శివతత్వంపై ప్రవచనం



ప్రవచనాన్ని వినిపిస్తున్న పి.శ్రీనివాసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఒంగోలుకు చెందిన పి.శ్రీనివాసులు వారిచే శివత్వంపై నిర్వహించిన ప్రవచన కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. ప్రతిరోజూ నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలను దేవస్థానం ఏర్పాటు చేస్తుంది.